# సన్‌ఫ్లవర్

## రాధిక




కాలింగ్‌బెల్ మోగింది. వంటగదిలో పనిలో ఉన్న అనూష వచ్చి తలుపు తీసింది. సంతోషంతో 'ఓ, మీరా, రండి. రండి' అంది.

"అరె. నా పేరెలా తెలుసు మీకు? నిన్ననేగా మన పరిచయం బీచ్‌లో జరిగింది ! నా పేరు మీ రడగలేదు. మీ పేరు నే నడగలేదు. నా పేరు సమీర. అందరూ మీర అంటారు" అంది నవ్వుతూ.

"బావుంది. లోపలికి రండి." అనూష అంది.

"ఏమిటి బావుంది. నా చీరా? అబ్బే దీనికి చిరుగులేమీ లేవండి. నేను చిరుగులను జాగ్రత్తగా కుచ్చిళ్ళలో దాచేసి దోపేయలేదు. ఇది కొత్త చీరే." సమీర అంది.

నవ్వింది అనూష.

"కూర్చోండి." కుర్చీ చూపిస్తూ అంది అనూష. అక్కడ రెండు కుర్చీలు, చిన్న మోడా ఉన్నాయి. అనూష మోడాపైన కూర్చోబోతూ "కూర్చోండి, సమీరా" అంది.

"నేను లావుగా ఉన్న మాట నిజమే గాని, నాకు ఒక కుర్చీ చాలండి. మీరు ఆ చిన్న మోడా మీద కూర్చుని అవస్థ పడడం ఎందుకు. ఈ కుర్చీమీద కూర్చోండి" అంటూ మరో కుర్చీ చూపించింది అనూషకు.

అనూష నవ్వుతూ సమీర పక్కన కూర్చుంది. ఇద్దరూ కబుర్లు మొదలుపెట్టారు.

"నిన్న బీచ్‌లో మీ పక్కన కూర్చున్నావిడ ఎవరు?" అనూష అడిగింది.

"ఓ, ఆవిడా, అదే నల్లగా, ఎత్తుపళ్ళతో, పొట్టిగా ఉంది." నవ్వు వళ్ళబిగువున పెట్టి అంది సమీర.

ఎదుటివారి అందాన్ని అలా హేళన చేసి మాట్లాడడం విచిత్రం అనిపించింది అనూషకు.

ఆమె మనసు గ్రహించి సమీర-"నా మాటలు వేరుగా తలచకండి. అలా ఎందుకన్నాను అంటే, ఆవిడకు తను కాలేజీ బ్యూటీ నని గర్వం ఎక్కువ" అంది.

ఈసారి అనూష ఆశ్చర్యపోయింది- "నిజంగా?" అంది.

"అవును. నిజంగానే. ఆవిడ చాలాకాలం క్రితం ఇంజనీరింగు చదివింది. అప్పుడు లేడీస్ చాలా తక్కువమంది ఉండేవారు కదా ! ఇంజనీరింగ్ కాలేజీలో ఇద్దరే ఆడవాళ్ళు ఉండేవారట. ఆ ఇద్దరిలో ఒకావిడకు బొల్లి ఉండడంతో, ఈవిడే కాలేజీ బ్యూటీ నని మురిసిపోయేదట."

ఈసారి అనూష నవ్వకుండా ఉండలేకపోయింది.

"మీరు చాలా సరదాగా మాట్లాడతారు. మీ ఇంట్లో వాళ్ళు అదృష్టవంతులు. ఎప్పుడూ ఇలా నవ్విస్తూ ఉంటారా? మీ ఇంట్లో ఎవరెవరు ఉంటారు?"

"మా ఇంట్లోనా? నాతో, నేను మాట్లాడేది వినిపించుకోకుండా తనకు తానే వాగేది రేడియో, నేను రింగ్ చేయకుండానే దానికి అదే మోగేది ఫోను, ఈ రెండింటితో పాటు నాకున్న తోడు టీ.వీ. నేను దానివైపు, అది నావైపు చూస్తూ ఉంటాం- అది ఆన్‌లో ఉన్నప్పుడల్లా."

"అయితే మీ ఇంట్లో మీ రొక్కరే ఉంటారన్న మాట."

"అరె. నేను అలా చెప్పలేదే. మా వారు కూడా ఉంటారు. ఆయన అప్పుడప్పుడు ఆ,ఊ- అని కూడాఅంటుంటారు."

"అయితే ఆయనకు మౌనం ఇష్టమన్న మాట."

"అవును. మాట్లాడాలంటే కష్టం ఆయనకు."

ఇద్దరూ కాఫీలు తాగి అలా తోటలోకి వచ్చారు. అనూష వాళ్ళిల్లు సముద్రపు ఒడ్డున ఉండడంతో చాలా అందంగా సముద్రం కనబడుతూంది. కెరటాలు ఎక్కడికో వెళ్ళాలని ఎగసిపడుతున్నాయి గాని, ఎక్కడికీ వెళ్ళలేక పోతున్నాయి. తమలో తామే గంతులేస్తున్నాయి.

"మీకు సన్‌ఫ్లవర్ అంటే ఇష్టమా. చాలా చెట్లు పెంచారే?" సమీర అడిగింది.

'అవును. పెళ్ళయిన ప్రతి స్త్రీ తన ఇంట్లో ఒక

పొద్దుతిరుగుడు చెట్టు వేసికొని దాన్ని చూస్తూ, మగవాడి నీతిని దానికి అన్వయించుకోవాలని నే నంటాను.'' ఆవేదనగా అంది అనూష.

ఆమె భావం సమీరకు అర్థం అయింది. అనూష తన భర్తకు విడాకు లివ్వాలని అనుకుంటోందని వింది. అనూష భర్త ఈమధ్య ఎవరిమీదో మనసుపడ్డాడని, అందుకే ఆమె భర్తతో తెగతెంపులు చేసుకోవాలని అనుకుంటుందని గ్రహించి, ఆమె దగ్గరకు వచ్చింది. కాని అనూషకు తెలియదు, తన భర్త మోజుపడేది సమీర మీదేనని.

"ఎందుకు అలా అంటున్నారు?'' సమీర అడిగింది.

"నా భర్త, నేను ప్రేమ వివాహం చేసుకున్నాం. ఆ ప్రేమ ఒక సంవత్సరం మాత్రమే ఉంది. ఆ తరువాత నేను పాతబడిపోయాను.''

"నా స్నేహితురాలు ఒకామె ఉండేది. ఆమె చెప్పింది. తను వంట సరిగా చేయక, ఇల్లు నీట్‌గా పెట్టక బద్ధకంగా ఉండేదట. దానితో ఆమె భర్త ఇల్లు చక్కగా పెట్టుకొని, వంట బాగా చేసే మరో ఆడదాని వెనుక పడ్డాడట. అందుకు భిన్నంగా నేను ఇంటిని సర్దడం, వంటను చేయడం మొదలుపెట్టాను. దానితో నాకు ఎక్కువ తీరిక దొరికేది కాదు. ఎంతసేపు పనిలోనే శ్రద్ధ చూపించేదాన్ని. ఆయన నా పనికీ, వంటకు ముచ్చటపడిపోయి, నా కొంగు పట్టుకువేలాడతా రనుకున్నాను. కాని మావారు ఖాళీగా ఉండి, చక్కగా గోళ్ళు పెంచుకొని, వాటికి రంగు వేసుకొని, ఎప్పుడూ ట్రిమ్‌గా కనబడే ఆడవాళ్ళంటే ఇష్టపడుతున్నారు. వాళ్ళ ఆఫీసులోనే పెళ్ళయిన ఒకావిడ అంటే ఇష్టపడుతున్నారని కూడా తెలిసింది. అసలు మగవాడికి కావలసింది మార్పు గాని, ఆడదాని ఓర్పు కాదు.''

"అవతల ఆవిడకు ఇష్టమో, కాదో తెలుసుకున్నారా?''

"ఊహు. నాకు అంత ఓపిక, తీరిక లేవు. నా భర్త నన్ను ఇష్టపడడం లేదంటే, ఆయన్ను పట్టుకుని వేలాడేంత తెలివితక్కువదాన్ని కాదు. ఏదో చదువుకున్నాను. నా కాళ్ళమీద నేను నిలబడగలను.''

"నా స్నేహితురాలు ఒకామె ఇలాగే భర్త ఆకతాయి పనులు భరించలేక, ఆ ఇంట తనకు విలువలేదని భర్తకు దూరంగా వెళ్ళిపోయింది. చుట్టూ ఉన్న సమాజం ఆమెను రాబందుల్లా మాటలతో పీక్కుతినేసరికి, భర్త దగ్గరే నయం అనుకొని భర్త దగ్గరకు వెళ్ళిపోయింది.''

"భర్త మరో ఆడదాని వెంట పడుతుంటే అది ఆకతాయితనమా?'' ఆశ్చర్యంగా అడిగింది అనూష.

"అనూషా ! ఈ సన్‌ఫ్లవర్ చూడు, త నున్న నేలను, చెట్టును మరచి ఆ సూర్యుడివైపు ఎలా తిరుగుతుందో. సూర్యు డున్నంతసేపూ అలా తిరుగుతుంది. దానికి అ దో భ్రమ అంతే. చివరికి ఆ సూర్యుణ్ణి అందుకోనూలేదు, నేలను విడిచి వెళ్ళనూ లేదు. అయినప్పటికీ అలా చూడడంలో అ దో ఆనందం. అంతే.''

"అయితే, దానికీ-దీనికీ సంబధం ఏమిటి?''

"మగవాడూ అంతే. తనున్న ఇల్లు, సంసారం విడిచి తాను వెళ్ళలేకపోయినా, పొద్దుతిరుగుడు పువ్వు సూర్యుడివైపు తిరిగినట్లే తానూ ఎదుటివారిని ఆకర్షణతో చూస్తాడు. కాని అవతలవారు అంత తేలికగా అందిపోతారా, లొంగిపోతారా? అవతలి స్త్రీలకు మాత్రం నీతి, నియమాలు ఉండవా? సన్‌ఫ్లవర్ నేలను, ఆకులను, కొమ్మలను విడిచి సూర్యుణ్ణి ఎలా చేరుకోలేదో, ఆ చెట్టు నుంచి తెగిపోతే ఎలా బ్రతకలేదో, అలాగే మగవాడూను. సంసార బంధంలో నుండి అంత త్వరగా బయటపడలేడు.''

"ఏమో, నేను అంత దూరం ఆలోచించలేదు. నన్ను నిర్లక్ష్యం చేస్తున్నారనే భ్రమ పడుతున్నాను.''

"నీవైపు ఎవరైనా మరో మగవాడు ఆకర్షితుడైతే అది అతని తప్పుగాని, నీది కాదుగా? మగవాడి మనస్తత్వమే అంత. చూపులతోనే మరో ఆడదాన్ని తినేయాలి అనే చిన్న కోరిక. కాని ఎదుటి స్త్రీలను మనం తక్కువ అంచనా వేయకూడదు. వాళ్ళూ అంత త్వరగా లొంగిపోరు'' అంది.

"నిజమే, చాలా బాగా చెప్పారు సమీరా? నిజంగా నా మనసులో బాధ తీసేశారు. ఇంకెప్పుడూ జీవితంలో నిరాశకు తావివ్వను. నా భర్తలో ఆ చిన్న విషయం తీసేస్తే, మరే లోపం లేదు. మీకు చాలా థాంక్స్ మాటలతో బాధ పోగొట్టినందుకు'' అంది.

"థాంక్స్ మీకే. అంత త్వరగా నన్ను అర్థం చేసుకున్నందుకు'' అని అసలు విషయం చెప్పేసింది సమీర.

అనూష తేలిగ్గా గాలి పీల్చుకుంది.

◆


**కేశవర్ధిని...**

**పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం**



పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనె

అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందచేశారు.

కొద్దిచుక్కల కేశవర్ధినిని ఒక చెంచాడు కొబ్బరినూనెలో కలిపి శిరోజాలకి రోజూ రెండుసార్లు బాగా రాస్తే అవి ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగ లాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.

ఈ రోజునే కేశవర్ధిని కొనండి.

ఆరు నెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.




OBM 8473/TEL

**కేశవర్ధిని**

తలనూనె

కేశవర్ధిని ప్రోడక్ట్స్ (మద్రాసు)

మద్రాసు-600 092